క్లుప్తంగా

న్యాయ కళాశాల ఏర్పాటుకు వినతి

చింతూరు: ఆదిమ జాతుల కోసం భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సోందె వీరయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు వినతిపత్రం అందచేసినట్టు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతానికి చెందిన స్థానిక యువత కోసం భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని, దీనికోసం ఈ ఏడాది డిసెంబరు 24,25 తేదీల్లో భద్రాచలంలో గోండ్వానా గర్జన సదస్సును నిర్వహించను న్నామని ఆయన చెప్పారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ చిన్నబాబు

అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద, సుంకరమెట్ట, బెడ్డగుడ, కిన్నంగుడ, లింబగుడ, దండబాడు గ్రామాల పాఠశాల్లో చదువుతున్న 340 మంది పేద విద్యార్థులకు దాతల సాయంతో మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ చిన్నబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయుడు చిట్టిబాబు, స్థానికులు రఘు, నాని తదితరులు పాల్గొన్నారు.

61 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

గంగవరం : కొమరవరం ఎంపీపీ పాఠశాలలో అత్యవసర వైద్య శిబిరం నిర్వహించి, 61 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపినట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి భావన తెలిపారు. విద్యార్థుల చేతులపై నీటి కురుపుల వల్ల ఇన్ఫెక్షన్ వచ్చిందని ఉపాధ్యాయురాలు వంశీప్రియ తెలపగా మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. 25మందికి ఇన్ఫెక్షన్ వచ్చిందని తెలిపారు. ఏఎన్ఎంలు నాగమణి, తాము అనూష తదితరులు వైద్యశిబిరంలో సేవలందించారు.

అందరి సహకారంతో చింతపల్లి అభివృద్ధికి కృషి

చింతపల్లిరూరల్: అందరి సహకారంతో చింతపల్లి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత తెలిపారు.స్థానిక సచివాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. అన్ని రాజకీయ పక్షాలు గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఝాన్సీ, కూటమి నాయకులు జ్ఞానేశ్వరి, ఆనంద్, వంతల బుజ్జిబాబు, కిముడు పండు కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సర్వే ఉద్యోగుల సంఘ ఆవిర్భావ దినోత్సవం


రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

రంపచోడవరం: ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం 58వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం రంపచోడవరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవా, జిల్లా కార్యదర్శి లీలాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా పట్టాభి రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వే సంఘానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే దేవేంద్రుడు, డీఐవోఎస్‌లు బాబురావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా పెరటి తోటల పెంపకం


జీవన ఎరువులపై అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్తలు డాక్టర్ తేజేశ్వరరావు,ప్రదీప్‌కుమార్


గలగండ రైతులకు విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారి

జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరరావు

పెదబయలు: ప్రతి రోజు ఇంట్లో వాడుతున్న నీరు వృథాగా పోకుండా దానితో ఇంటి ఆవరణలో పెరటి తోటల పెంపకాన్ని విస్తృతంగా చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం పాడేరు సమన్వయ కర్త, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.తేజేశ్వరరావు తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన మండలంలోని గలగండలో పెరటి తోటల పెంపకంపై జిల్లా ఏరువాక కేంద్రం, మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కూరగాయలు, ఆకుకూరల పెంపకంపై 30 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ తేజేశ్వరరావు మాట్లాడుతూ వాడుక నీరు, స్థానికంగా లభించే పశువుల గెత్తం వినియోగించి పెరటి తోటలు ఎలా పెంచవచ్చో వివరించారు. జీవన ఎరువుల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. పెరటి తోటల్లో టమాట, వంగ,బంగాళదుంపలు,క్యారెట్,బీన్స్,తీగ జాతి కూరగాయాలు,ఆకుకూరలు సాగుచేయడం వల్ల ఇంటిల్లపాదికి పోషకాలతో కూడిన ఆహారం లభిస్తుందని చెప్పారు. ప్రతి ఇంట్లో స్వచ్ఛమైన కూరగాయలు,ఆకుకూరలు పండించుకుని భుజించడం వల్ల ఆర్యోంగా జీవించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన 30 మందికి ఉచితంగా కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏరువాక వ్యవసాయ శాస్త్రవేత్త బి.వి.ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ.శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో నమూనా పోషక తోటల విస్తరణ

ఆచార్య ఎంజీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో నమూనా పోషక తోటల పెంపకం విస్తరణకు శ్రీకారం చుట్టినట్టు ఈ సందర్భంగా జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరరావు తెలిపారు. మొదటిగా గలగండలో దీనిని ప్రారంభించామని, అనంతరం జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రతిఇంటికీ విస్తరిస్తామని చెప్పారు. ఎలాంటి క్రిమిసంహారక మందులు వాడకుండా మంచి ఆరోగ్యవంతమైన కూరగాయలు,ఆకు కూరలు పండించుకునే అవకాశం ఉందని, ముఖ్యంగా మహిళలు,చిన్న పిల్లలకు మంచి పోషకాహారం అందించే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు


చవిటిదిబ్బలులో స్కానింగ్‌కు హాజరైన గర్భిణులు


అనంతగిరి పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి జ్ఞానేశ్వరి

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో మంగళవారం 78 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీ సూపరింటెండెంటు డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వీరిలో 32 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు. వారికి ప్రత్యేక వైద్య సేవలు, అవసరమైన మందులు అందించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా భోజన, రవాణాసౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: గర్భిణులు ప్రతినెలా క్రమతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి జ్ఞానేశ్వరి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 70 మంది గర్భిణులకు మంగళవారం వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పడే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆస్పత్రిల్లో ప్రసవాలు సురక్షితమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో నర్సింగరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్నా మంజూరుకాని పింఛన్


దివ్యాంగుడు మోహన్

ముంచంగిపుట్టు: అర్హత ఉండి కూడా పింఛన్ కోసం పదేపదే అధికారుల చుట్టూ తిరగాల్సివస్తోందని గిరిజన దివ్యాంగుడు ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని మారుమూల బూసిపుట్టు పంచాయతీ సంతవీధికి చెందిన కిల్లో మోహన్‌రావు అనారోగ్య సమస్యతో పుట్టాడు. రాను రాను సమస్య అధికమై వీపుపై పెద్ద కాయ ఏర్పడింది. వికలాంగ పింఛన్‌కు అర్హత ఉంది. వైద్యులను నుంచి పింఛన్‌కు కావాల్సిన మెడికల్ సర్టిఫికెట్ పొందాడు." ఎంఛన్ మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు దరఖాస్తులు చేసినా ఎవరూ స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పింఛన్ మంజూరు చేయాలని మోహన్ కోరుతున్నాడు.

గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించండి

వై.రామవరం: కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులతోపాటు సచివాలయాల సిబ్బందిని ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయం నుంచి మంగళవారం ఎంపీడీవో జూమ్ మీటింగు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ఏఎన్ఎంలు మినహాయించి మిగతా సిబ్బంది గ్రామాల్లో సర్వే నిర్వహించాలన్నారు. మండలంలో ఆధార్‌కార్డు లేనివారి డేటా, అధార్ కార్డు అప్‌టుడేట్ చేయని వారి డేటాను ఇంటింటా సర్వేలో సేకరించాలని తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా అన్ని గ్రామాల్లో తప్పనిసరిగా పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ప్లాస్టిక్ వినియోగంతో పెనుముప్పు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ రాంబాబు

దేవీపట్నం: విపరీతంగా పెరిగిన ప్లాస్టిక్ వినియోగంతో భావి తరాలకు పెను ముప్పు వాటిల్లనుందని ప్రకృతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ కొమరం రాంబాబు అన్నారు. మండలంలోని సీతారం పోలవరం ఆర్అండ్ఆర్ కాలనీలో మంగళవారం పర్యావరణ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తిని అనారోగ్యం పాలవుతున్నాయని చెప్పారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్‌ను వాడవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన మహిళలు పాల్గొన్నారు.

పట్టిసీమ తరహా ప్యాకేజీ ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

చింతూరు: పోలవరం నిర్వాసితులకు పట్టిసీమ తరహా ప్యాకేజీ ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం చింతూరులో జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ సర్వం కోల్పోతున్న నిర్వాసితుల పట్ల శ్రద్ధ వహించి, 2013 భూసేకరణ చట్టం ఆధారంగా పరిహారం అందించాలని, పట్టిసీమ ప్యాకేజీ తరహాలో ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించాలని కోరారు. 10 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ పరిహారం అందించాలని, భూమిలేని నిరుపేదలకు న్యాయం చేయాలన్నారు. కేంద్రం ప్రభుత్వం నుంచి త్వరితగతిన నిధుల రాబట్టి నిర్వాసితులకు పరిహారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పల్లపు వెంకట్, లక్ష్మణ్, సుబ్బారావు, నారాయణ, దిలీప్, చరణ్ పాల్గొన్నారు.

పంటలను పాడు చేస్తున్న పశువులు


పశువులు తొక్కడంతో పాడైన వరి నారు మడిలో ఓ భాగం

రాజవొమ్మంగి: మండలంలో పశువులు యథేచ్ఛగా సంచరిస్తూ పంటలను పాడుచేస్తుండడంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలకరి మొదలై, ప్రస్తుతం ఎక్కడ చూసినా వరి నారు మడులు పచ్చగా, ఏపుగా పెరుగుతున్నాయి. అయితే ఆవులు, గేదెల యజమానులు వాటిని కట్టడి చేయకుండా వదిలి పెడుతుండడంతో అవి నారుమడులు, ఇతర పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు తెలిపారు. నారుమడులను పశువులు కాళ్లతో తొక్కి, మొలకలను తినేయడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని చెప్పారు. మరోసారి నారుమడి తయారు చేయాలంటే 20 రోజుల సమయం పడుతుందని, ఇంతలో అదను దాటిపోతుందని తెలిపారు. సంబంధిత అధికారుల, ప్రజాప్రతినిధులు పశువుల కాపర్లు, యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి పశువుల కట్టడికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఎటపాక: మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేసే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భద్రాచలాన్ని కూడా ఆంధ్రాలో కలిపి భద్రాద్రి రామయ్య జిల్లాగా ప్రకటించాలని, గిరిజనుల రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన తెలిపారు. ఐదు పంచాయతీలను తెలంగాణాలో కలపడం వల్ల గిరిజనులకు ఎలాంటి లబ్ధి చేకూరదని, దీనిపై కేంద్రానికి తీర్మానం పంపడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికి నిరసనగా గిరిజన సంఘాలతో కమిటీని ఏర్పాటుచేసి పోరాటాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

అందుబాటులో సిల్వర్ ఓక్ మొక్కలు


నర్సరీలో సిల్వర్ ఓక్ మొక్కలు

జి.మాడుగుల: మండలంలో కూనేటి గ్రామంలో గిరిజన రైతుల కోసం సిల్వర్‌ఓక్ మొక్కలను అందుబాటులో ఉంచినట్టు రైతు నేస్తం ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు సిల్వర్‌ఓక్ నర్సరీని కూనేటి గ్రామంలో ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. రైతు ఫౌండేషన్ ద్వారా ఒక్కో మొక్కను రూ.10 చొప్పున రైతులకు అందించనున్నట్టు ఆయన తెలిపారు. గిరిజన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 8688150214, 8985009424 అనే నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు


పూసుగుగూడెం- టేకులబోరు రోడ్డు మరమ్మతులు చేస్తున్న యువకులు

కూనవరం: పూసుగు గూడెం నుంచి టేకులబోరు వరకు జెడ్పీ రోడ్డుకు ఆటో యూత్ యూనియన్ సభ్యులు మంగళవారం శ్రమదానంతో మరమ్మతులు చేశారు. ఆటోలలో చిప్స్, మెటల్ తెచ్చి రోడ్డుపై గోతులను పూడ్చారు. శబరి కొత్తగూడెం, చినార్కూరుకు ఆటోలు నడిపే యువకులు కట్టి తమ్ముడు, కుంజా శంకరు, బొడ్డు నారాయణ, కుంజా విజయ్, కుంజా సీతారామయ్య, కారం అర్జున్, మడ్రి విజయ్, కట్టి తరుణ్, సోందె రామ్, సరియం మహేష్, బొడ్డు చంద్, మహేష్, పూసం బాలు, కుంజా ముత్తయ్యలు మంగళవారం రోడ్డు మరమ్మతులు చేపట్టారు. చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్ చొరవతో ఆటో యూత్ సభ్యులు శ్రమదానం చేశారు.

దాణాగా మేలుజాతి పశుగ్రాసం

పాడేరు పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు నర్సింహులు


ఎం. కోటపాడులో పశుగ్రాస ముచ్చలను రైతులకు అందజేస్తున్న నర్సింహులు

మాడుగుల రూరల్: మేలుజాతి పశుగ్రాసాన్ని పాడి పశువులకు మేతగా వేయడం వల్ల అధిక పాల దిగుబడి సాధించవచ్చునని పాడేరు పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు సి.హెచ్. నర్సింహులు తెలిపారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎం. కోటపాడు పశుగ్రాస క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ మేలు జాతి రకానికి చెందిన సూపర్ నేపియర్, రెడ్ నేపియర్ పశుగ్రాసం పాడి రైతులు తమ పశువులకు మేతగా వేయాలని సూచించారు. పశువులు మేతకు సంబంధించి పశుగ్రాసం ముచ్చలను భూమిలో పాతుకోవాలన్నారు. వాటి ద్వారా పశుగ్రాసం పెరుగుతుందన్నారు. అనంతరం పశుగ్రాస ముచ్చలను రైతులకు ఉచితంగా అందజేశారు. కె.జె.పురం పశువైద్యాధికారి పి. మణిలక్ష్మణ్, పశువైద్య సహాయకుడు రమేష్ పాల్గొన్నారు.

సబ్సిడీ వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సింహాచలం

అరకులోయ రూరల్: సబ్సిడీతో అందజేస్తున్న వ్యవసాయ పరికరాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ చైర్మన్, డైరెక్టర్ సింహాచలం తెలిపారు. 14 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ బిజినెస్ అసోసియేట్లకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో అర్హులైన పట్టాదారు రైతులందరికీ 30శాతం సబ్సిడీతో పీఎం కిసాన్ ద్వారా టిలర్లు,ట్రాక్టర్లు, పవార్ వీడర్లు, వివిధ రకాల మొక్కలు,విత్తనాలు అందిస్తున్నామన్నారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మన్యంలో యువతకు వనరులు సమకూర్చి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కిల్లో రామన్న,వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నర్సిహమూర్తి, మండల ఎంబీఏ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్ల నిధులు స్వాహాచేసిన అధికారులపై చర్యలు చేపట్టాలి


గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న జెడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి: మండలంలోని పలు గ్రామాలకు రోడ్లు వేయకుండా నిధులు స్వాహాచేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2020–21 సంవత్సరంలోని మండలానికి చెందిన చీడిగరువు నుంచి రాళ్లగరువు, పెదకోట రోడ్డు నుంచి బుడ్డిగరువు, బుడ్డిగరువు నుంచి చీడిగరువు, బొర్రా రహదారి నుంచి పూలగూడ వరకు ఫార్మేషన్ రోడ్లు నిర్మించకుండా నిధులు స్వాహాచేసిన అధికారులపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫార్మేషన్ రోడ్లకు సంబంధించి రూ.2.50 కోట్లు, సీసీరోడ్డుకు సంబంధించి 40 లక్షలు స్వాహాచేశారని తెలిపారు.

రిటైర్డ్ పోస్టల్ బీపీఎంకు ఘన సన్మానం


గంగారావు దంపతులకు సన్మానిస్తున్న ఐపీవో ఉపేంద్ర, సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు బ్రాంచ్ పోస్టాఫీసులో బీపీఎంగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన సమరెడ్డి గంగారావును పోస్టల్ ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐపీవో ఉపేంద్ర మాట్లాడుతూ గంగారావు విశేషమైన సేవలందించారని చెప్పారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం గంగారావు, ఆయన సతీమణి పద్మావతిలకు జ్ఞాపికలు అందజేసి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం బప్పికుమార్,ఎంవోలు శ్రీను,గోపాల్,పీపీ నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రో బంక్‌లో పంపులను తక్షణమే బాగు చేయాలి

పెదబయలు: జీసీసీ ఆధర్యంలో నిర్వహిస్తున్న స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్ వేసే పంపులను వెంటనే సరిచేయాలని స్థానిక జీసీసీ మేనేజర్ పి.గాసి, సీనియర్ అకౌంటెంట్ పద్మనాభం, మండల వినియోగదారుల సంఘ అధ్యక్షుడు పాంగి శివప్రసాద్ సూచించారు. ఈ బంక్‌లో రెండు పంపులు మాత్రమే పనిచేస్తున్నాయని మండల వినియోగదారుల సంఘానికి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ విషయం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో వారి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక జీసీసీ మేనేజర్ పి.గాసి, సీనియర్ అకౌంటెంట్ పద్మనాభం, మండల వినియోగదారుల సంఘ అధ్యక్షుడు పాంగి శివప్రసాద్ బంకులో పంపులను పరిశీలించారు.

వెంటనే హెచ్‌పీ కంపెనీ అధికారులతో మాట్లాడారు. పాడైన పంపులను సరిచేసి వినియోగంలోకి తేవాలని కోరారు. వారం రోజుల్లో వినియోగంలోకి తేస్తామని బంక్ మేనేజర్ తెలిపారు.

విద్యార్థినులకు మలేరియా ర్యాపిడ్ స్క్రీనింగ్ టెస్టులు


అమీనాబాద్ ఆశ్రమపాఠశాలలో పిల్లల ఎత్తు కొలతలు తీస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి : మండలంలోని అమీనాబాద్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 17 మంది విద్యార్థినులకు మలేరియా ర్యాపిడ్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించినట్టు జడ్డంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ యామిని ప్రియ తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో మొత్తం 32 మంది విద్యార్థినులకు వివిధ పరీక్షలు చేసినట్టు చెప్పారు. బరువు, ఎత్తు కొలతలు నమోదు చేసి, వారి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నామని, సమస్యలు ఉన్నవారికి మందులు ఇచ్చామని తెలిపారు. పిల్లలు తప్పనిసరిగా దోమతెరలు ఉపయోగించేలా చూడాలని హెచ్‌ఎం ప్రమీలారాణిని కోరారు. ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, హెచ్‌వీ చిన్నయమ్మ, 104 డీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీల నిర్వాహకుల్లో ఒకరి అరెస్టు


కొమరాపురంలో మహిళలతో మాట్లాడుతున్న ఎస్ఐ రఘునాథరావు

రాజవొమ్మంగి : మండలంలోని వాతంగికి చెందిన సారా బట్టీల నిర్వాహకుడు కంచెం నాగరాజును అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్టు జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు మంగళవారం తెలిపారు. మరో ఇద్దరిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. వాతంగి పంచాయతీ పరిసర అటవీప్రాంతంలో జోరుగా సారా వ్యాపారం, బట్టీల నిర్వహణపై వాతంగి, ఓగిపాలెం, ఓకుర్తి గ్రామాలకు చెందిన మహిళలు ఉద్యమించారు. ఆయా ప్రాంతాల్లో లభించిన సారా పులుపు నేలపాలు చేసి, బెల్లం తదితర సరకులను అగ్నికి ఆహుతి చేసిన సంగతి కూడా విధితమే. స్పందించిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. వాతంగి పరిసర ప్రాంతాల్లో ఇకపై సారా బట్టీల ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకొంటున్నట్లు ఎస్ఐ 'సాక్షి' కి తెలిపారు. అలాగే సారాపై ఉద్యమించిన మహిళలతో ఎస్ఐ సమావేశమయ్యారు. సారా వ్యాపారుల భరతం పడతామని హామీ ఇచ్చారు.